# మోడీ, బాబు పాలనలో రైతాంగం దివాళా!
# సంఘటితంగా ఉద్యమించాలి!!



## భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ

# మోడీ, బాబు పాలనలో రైతాంగం దివాళా! సంఘటితంగా ఉద్యమించాలి!!

మనదేశ, రాష్ట్ర ఆర్థిక, సాంఘిక, భౌగోళిక పరిస్థితులలో వ్యవసాయం అత్యంత కీలకరంగం. ఇప్పటికీ నూటికి 60 మంది ప్రజలు వ్యవసాయంలోనే జీవనం సాగిస్తున్నారు. దేశంలో 120 కోట్ల మందికి ఆహార భద్రత వ్యవసాయం రంగంపైనే ఆధారపడి ఉంది. వ్యవసాయరంగంలో ఉన్న 72 కోట్ల మంది ప్రజల జీవనస్థాయి పెరిగి కొనుగోలు శక్తి పెరిగితే భారత పారిశ్రామిక రంగం కూడా అభివృద్ధి సాధిస్తుంది. కాంగ్రెస్ లేదా బిజెపి ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వ్యవసాయరంగాన్ని అభివృద్ధి పరచి దేశాభివృద్ధిని సాధించాలని కాకుండా నయా ఉదారవాద విధానాల ద్వారా వినాశనం వైపు నడిపించారు.

స్వాతంత్ర్యనంతరం వ్యవసాయరంగాన్ని మూడు దశలుగా పరిశీలించవచ్చు. 1947 నుండి 1965 వరకు ఒక దశ, 1966 నుండి 1990 వరకు మరొకదశ, 1991 నుండి ఇప్పటి వరకు ఇంకొక దశగా చూడవచ్చు.

స్వాతంత్రం వచ్చినప్పటి నుండి 1965 వరకు వ్యవసాయం అభివృద్ధికాకపోడవమే కాదు ఉత్పాదకత లేక పెరుగుతున్న దేశజనాభాకు ఆహారన్నిందించే పరిస్థితి నాడు లేదు. దానితో ఉత్పాదకత పెంచడానికి హరిత విప్లవం అవసరమని భావించి నీటి పారుదల ప్రాజెక్టులు, హైబ్రీడ్ విత్తనాలు తయారు చేయడం, ఎరువులు సబ్సిడీపై అందించడం, మద్దతు ధరలు ఇవ్వడం, వ్యవసాయ విస్తరణ సౌకర్యం కల్పించడం జరిగింది. ప్రజా పోరాటాల ఫలితంగా ఈ కాలంలోనే భూ సంస్కరణ చట్టాలు రావడం లక్షల ఎకరాల భూ పంపిణీ జరిగింది. వామ పక్షాల పరిపాలించిన బెంగాల్, కేరళ, త్రిపురలో అత్యధిక భూ పంపిణీ జరిగింది. 1970 దశకంలో వచ్చిన ఎస్సైన్‌మెంట్ చట్టాల ద్వారా లక్షలాది ఎకరాల బంజరు భూములు పేదలకు పంచబడ్డాయి. ఒక మేరకు భూ కేంద్రీకరణ తగ్గి వ్యవసాయోత్పత్తులు పెరిగాయి. ఆహార పదార్థల ఉత్పత్తిలో ఒక మేరకు స్వయం సమృద్ధి సాధించగలిగాం.

1991 నుండి సంస్కరణల పేరిట నయా ఉదారవాద ఆర్థిక విధానాలు ప్రవేశ పెట్టారు. వ్యవసాయోత్పత్తుల దిగుమతుల ద్వారాలు తెరవడమే కాక వ్యవసాయరంగంలోకి ప్రత్యక్షంగా విదేశీ పెట్టుబడులు ఆహ్వానించారు. అప్పటివరకు ఉన్న రక్షణ విధానాలను, ఆంక్షలను పూర్తిగా సడలించి విదేశీ కంపెనీలకు మన వ్యవసాయరంగాన్ని అప్పచెప్పారు.

భారత్‌ను డబ్ల్యూ.టి.ఓ.లో భాగస్వామి చేశారు. ఫలితంగా అప్పటివరకు మనదేశంలో రైతులు, రాష్ట్ర ప్రభుత్వాల చేతిలో ఉన్న విత్తనాలు విదేశీ బహుళజాతి కంపెనీల చేతులలోకి వెళ్ళి విత్తనాల రేట్లు 10రెట్లు పెరిగాయి. మరొకవైపున ఎరువుల ధరలపై నియంత్రణ ఎత్తివేయడంతో ధరలు ఆకాశన్నంటాయి. అలా ఉత్పత్తి ఖర్చులు 4,5రెట్లు పెరిగాయి. మరొకవైపున రైతు పండించిన పంటల మార్కెట్ ధరలు తీవ్ర ఒడిదుడుగులకు లోనయ్యాయి. ఉదా : క్వింటాలు 7000/– అమ్మిన ప్రత్తి 3000/–కు పడిపోవడం, 25000/– అమ్మిన పసుపు 7000/– పడిపోవడం, పొగాకు, మిర్చి, శనగ పంటల ధరలు తీవ్ర వ్యత్యాసాలకు లోనయ్యాయి. పైగా ఎగుమతుల కోసమని వాణిజ్య పంటలవైపు రైతాంగాన్ని మళ్ళించే ప్రయత్నం జరిగింది. వరికి కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలే తక్కువగా ఉంటే అవి కూడా అమలు కావడంలేదు.

వ్యవసాయం లాభసాటిగా లేకపోయినా సాధారణంగా బతుకుతున్న రైతులు 1991 తరువాత నూతన వ్యవసాయ విధాన కాలంలో తీవ్ర నిస్పృహకు గురైన్నారు. దేశ జనాభా 2శాతం పెరుగుదల రేటుతో పెరుగుతుంటే వ్యవసాయంలో అభివృద్ధి రేటు 1% మాత్రమే ఉన్నది. 45కోట్లా ఎకరాల భూమి ఉన్నా ఆహార ధాన్యాల ఉత్పత్తి సుమారు 25కోట్ల టన్నుల చుట్టూ తిరుగుతూ మాంద్యానికి గురైనది. దేశంలో 80శాతంగా ఉన్న సన్న, చిన్నకారు రైతులకు మిగులు భూములను, బంజరు భూములను పంచి వారికి సాగునీటి వసతి, ఇన్‌పుట్స్ సబ్సిడీలు, వడ్డీలేని రుణాలు, గిట్టుబాటు ధరలు కల్పించి వ్యవసాయ ఉత్పత్తిని, ఉత్పాదకను పెంచవచ్చు. అందుకు బదులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూములను, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగానికి కట్టబెట్టడానికి చట్టాలు చేశాయి. అమలుకు పూనుకుంటున్నాయి. అందుకు ప్రతిఘటిస్తున్న కోట్లాది మంది సన్న, చిన్నకారు రైతులకు, కౌలు రైతులకు వ్యవసాయ రంగం నుండి, తమ భూమి నుండి పొమ్మనకుండానే పొగ పెట్టినట్లు ఉద్దేశపూర్వకంగా వ్యవసాయాన్ని గిట్టుబాటు కాకుండా చేస్తున్నారు. ఈ కాలంలో దేశంలో సుమారు 3లక్షల మంది రాష్ట్రంలో 30వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రతి 41 నిమిషాలకు ఒకరైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో బోధ పడుతుంది.

ప్రభుత్వ లెక్క ప్రకారమే

స్థూలజాతీయోత్పత్తిలో వ్యవసాయరంగం వాటాను పరిశీలిద్దాం

| | |
|---|---|
| 1950–51 | 56.5% |
| 1970–71 | 45.9% |
| 1990–91 | 34.0% |
| 2009–10 | 15.7% |

| | |
|---|---|
| 2012-13 | 13.2% |
| 2014-15 | 14.1% |

కానీ మనదేశంలో వ్యవసాయం మీద ఆధారపడిన ప్రజల శాతం పెద్దగా మార్పులేదు. 1950-51 నుండి 70% ప్రజలు వ్యవసాయంలో ఉంటే 2014 సంవత్సరం లెక్కల ప్రకారం 58.2% ప్రజలు వ్యవసాయరంగంపై ఆధారపడి ఉన్నారు.

ఈ 65 సంవత్సరాల్లో వ్యవసాయరంగం వాటా జి.డి.పి.లో 56.5% నుండి 14% పడిపోయింది. 70కోట్ల మందికి పని కల్పిస్తున్న ఈ రంగంలో అతి తక్కువ ఆదాయంతో ప్రజలు ఉంటే, భారత్ వెలిగిపోతుందని కేంద్ర, రాష్ట్ర గావు కేకలు పెట్టడం వాస్తవ విరుద్ధం కదా?

మన పాలకులు దేశంలోని గుత్త పెట్టుబడిదారీ ప్రయోజనాలకు మోకరిల్లి పాడికుండ లాంటి వ్యవసాయరంగాన్ని నిర్లక్షంచేసి దేశ ప్రజలందరి ప్రయోజనాలను దెబ్బతీశారు. నిరంతరం విదేశీ అనుభవాలను జపించేపాలకులు వ్యవసాయానికి ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేసి పెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగిన దేశాలను చూశారా? మన ప్రక్కనే ఉండి మనకన్నా వెనుక స్వాతంత్ర్యం సంపాదించుకొని, మనతో అనేక అంశాల్లో సారూప్యత కలిగిన చైనా దేశం ఈ రోజు ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా రూపొందడానికి, కొద్ది సంవత్సరాలల్లో అమెరికాని దాటి మొదటి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్న దానికి కారణమేమిటి? పాలకులు గమనించరా?భూస్వామ్య విధానాని రద్దు చేసి సమగ్ర భూ సంస్కరణలు అమలు చేసి దున్నే వానికే భూమిని ఇవ్వడం ద్వారా రైతులను భాగస్వాములనుచేసి ఉత్పాదకత పెంచారు. 30కోట్ల ఎకరాల భూమిలో 60కోట్ల టన్నుల ఆహార ధాన్యాలను పండిస్తూ, 130కోట్ల ప్రజలకు కడుపు నిండా తిండి పెట్టి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వ్యవసాయం ద్వారా వచ్చిన మిగులతో పారిశ్రామిక, సాంకేతికాభివృద్ధి సాధిస్తు కూడా ఇప్పటికీ వ్యవసాయంపై ఎంతో శ్రద్ధ పెడుతున్న చైనా నుండి మనపాలకులు నేర్చుకోరా?

**మోడీ వాగ్దానాలు నీటి బుడగలే :**

2014 ఎన్నికలకు ముందు అంపశయ్య మీదున్న వ్యవసాయ రంగాన్ని బతికిస్తామని వాగ్దానాలు గుప్పించారు మోడీ, బాబు ద్వయం.

**నాటి మోడీ మాటలలో**

1. రైతును తల ఎత్తుకొనేట్లుగా చేస్తా
2. స్వామినాధన్ కమీషన్ నివేదిక ప్రకారం మద్దతు ధర ప్రకటిస్తా
3. ఎఫ్.సి.ఐ.ని బలోపేతం చేస్తా

4. రైతులకు ఆదాయ బీమా పథాకాన్ని ప్రవేశపెడతా.

**నేడు ప్రధాన మంత్రి శ్రీమాన్ నరేంద్రమోడీ మాటలు**

1.స్వామినాథన్ నివేదిక ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు 50% కలిపి మద్దతు ధర ప్రకటించలేము. అలా చేస్తే ఆహార ద్రవ్యోల్బణం పెరిగి పోయి ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. ఈ ఏడాది వరికి మద్దతు ధర ఎప్పుడు లేనంత హీనంగా పెంచారు. ఏదేని రాష్ట్ర ప్రభుత్వం తామే బోనస్ ఇస్తామన్నా కూడా బోనస్ ప్రకటించిన రాష్ట్రాలనుండి ఎఫ్.సి.ఐ. ద్వారా ధాన్యం సేకరణ చేయబోమని బెదిరించారు కూడా.

2.ఎఫ్.సి.ఐ. ని బలోపేతం చేస్తానన్న పెద్దమనిషి శాంతకుమార్ నాయకత్వాన ఎఫ్.సి.ఐ విధానాలను రూపొందించడానికి ఒక కమిటీని ఏర్పరిచారు. శాంతకుమార్ కమిటీ తన నివేదికలో ఎఫ్.సి.ఐ. కొన్ని రాష్ట్రాలలో ధాన్యం కొననవసరం లేదని నివేదించింది. యాపిల్స్ పండే హిమాచల్ ప్రదేశ్ నుండి వచ్చిన బి.జె.పి. నాయకుడు శాంతకుమార్ నుండి ఎఫ్.సి.ఐ.ని రైతులకండగా తీర్చి దిద్దుతాడని భావించగలమా? ధాన్యం లెవి సేకరణను 25శాతానికి తగ్గించడంతో రాష్ట్రంలో రైతులకు మద్దతు ధరలు కూడా లభించడంలేదు.

3.రైతులకు ఆదాయ బీమా పథకం మోడీ నోటనుండి వెలువడింది కాని విదేశీ ప్రయాణాల జోరులో అది కొట్టుకుపోయింది.

**రైతుల భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే భూ సేకరణ ఆర్డినెన్స్**

మోడీ ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరించడమే కాదు. భూసేకరణ ఆర్డినెన్స్ ద్వారా పచ్చిరైతు వ్యతిరేకిగా, వ్యవసాయ భక్షకులుగా రుజువు చేసుకుంటున్నారు. తిరోగమనానికి మరో ప్రత్యక్ష ఉదాహరణ ఈ భూసేకరణ చట్టంపై ఆర్డినెన్స్. ఎప్పుడో 1894లో నాటి బ్రిటిషు పాలకులు రోడ్లు, రైల్వేలు నిర్మించడానికి భూములు అవసరమై ఒక భూసేకరణ చట్టం తీసుకొచ్చారు. 120 సం॥రాల పాటు అదే చట్టం కొన్ని మార్పులతో అమలు జరిగింది. అది రైతు వ్యతిరేకమయిందని అనేక ఉద్యమాలు సాగాయి. పార్లమెంటులో, బయటా చర్చలు సాగాయి. ఎట్టకేలకు 2013లో అప్పటి ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. దీనిలో కొన్ని మంచి విషయాలు రైతులకు, ప్రజలకు అనుకూలంగా ఉన్నాయి.

1) ఏదేని ప్రభుత్వ అవసరాలకు భూసేకరణ చేయాలంటే 70% మంది రైతుల అంగీకారం కావాలి. ప్రైవేటు కంపెనీల కోసం అవసరమైతే 80% మంది రైతుల అంగీకారం కావాలి.

2) భూసేకరణ జరిగితే వచ్చే ఆర్థిక సామాజిక ప్రభావాలపై ఒక అధ్యయనం జరిపి ఆ నివేదికను ప్రభావానికి గురయ్యే వారందరికీ గ్రామ సభల్లో పబ్లిక్ హియరింగ్ ద్వారా వివరించాలి.

3) కేవలం భూ యజమానికే కాక సేకరించదలచిన భూమిపై ఆధారపడి జీవించే కౌలుదార్లు, వ్యవసాయ కార్మికులకు, వృత్తిదార్లు, చిరు వ్యాపారులకు నష్టపరిహారం చెల్లించాలి.

4)వితంతువులను, 18 సంవత్సరాలు నిండిన స్త్రీలేదా పురుషుడు పెళ్ళి అయినా కాకపోయినా కూడా ఒక కుటుంబంగా పరిగణించి పరిహారం ఇవ్వాలి.

5) పరిహారం భూమి విలువపై 4 రెట్లు వరకు ఉండవచ్చు.

తదితర సానుకూల అంశాలు ఉన్నాయి.

కానీ కార్పొరేట్ మోడీగారు అధికారంలోకి వచ్చిన 6నెలల్లోనే 2013 చట్టంలోని మంచి అంశాలపై వేటు వేస్తూ ఆర్డినెన్స్ తెచ్చారు. ఒకటి, రెండు సార్లు కాదు. ఏకంగా మూడు సార్లు ఆర్డినెన్సులు తెచ్చారు. చివరకు పార్లమెంట్ లో ప్రతిపక్షాలు ఏకోన్ముఖంగా నిలబడి అడ్డుకోవడం, దేశవ్యాప్తంగా రైతాంగ నిరసనల తర్వాత సర్కారు ప్రస్తుతం ఒక అడుగు వెనుకకు వేసి అని పార్టీలతో జాయింట్ పార్లమెంటరి కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. భూ సేకరణకు రైతుల ఆమోదం అవసరం అనే దాన్ని జాయింట్ పార్లమెంటరి కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అయినా కార్పొరేట్లకు సాగిలబడే మోడీ ప్రభుత్వం ఇంకేమైనా చేయవచ్చు. రైతాంగం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

అంతే కాదు మోడీ పాలనా కాలంలో వ్యవసాయాభివృద్ధి రేటు దిగజారింది. 2014లో 3.7% ఉండగా 2015లో 1.1%కు పడిపోయింది. ఆత్మహత్యలు 26శాతం పెరిగాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నా గత సంవత్సరమే ఇలా ఉంటే తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్న ఈ సంవత్సరం ఎలా ఉండబోతుందో!

– రైతుల ఆత్మహత్యలు ఆగలేదు సరికాదు గతంలో కన్న 26% పెరిగాయి.

నరేంద్రమోడీ బాటలోనే చంద్రబాబు

చంద్రబాబు నాయుడు గారు ఎన్నికలకు ముందు మూడేళ్ళనుండి నన్ను నమ్మండి, నేను మారానని. మరీమరీ నమ్మబలికి రైతాంగానికి అనేక హామీలు గుప్పించారు.

1. వ్యవసాయ రుణాలన్నింటినీ రద్దు చేస్తా.

2. నీటి పారుదల ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తా.

3. విడిపోయిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెచ్చి కేంద్రం నుండి భారీ సహాయంతో బ్రహ్మాండమైన రాజధాని నిర్మిస్తా.

ఆచరణలో చంద్రబాబుపాలనా తీరు అస్తవ్యస్తంగా మారింది. రైతాంగానికిచ్చిన వాగ్దానాల అమలులో కప్పగంతులు వేస్తూ మాటల్లో రైతుల్ని మురిపిస్తున్నారు. రైతులీ విషయాల్ని

గమనిస్తున్నారు.

**పెరిగిన రైతు రుణ భారం**

మీకోసం పాదయాత్రలో రైతుల కష్టాలు చూసి చలించిపోయాను. నేను మారాను. అధికారంలోకి వస్తే వ్యవసాయ రుణాలన్నింటినీ, ఎంతైనా రద్దు చేస్తానని ప్రకటించారు. రుణాలు చెల్లించమని బ్యాంకు అధికారులు వెంటబడుతుంటే ప్రతిపక్షనాయకుడిగా బ్యాంకర్లను హెచ్చరించడమే కాక రైతులను రుణాలు చెల్లించొద్దని ఆనాడు పిలుపిచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసంతకం రుణమాఫీ మీదేనని ప్రకటించారు. తీరా ఎన్నికల్లో నెగ్గి ప్రమాణ స్వీకారం రోజున తొలిసంతకం పెడతారని ఎదురుచూసిన రైతన్నలు హతాశులయ్యారు. రుణమాఫీ కోసం కాక విధి విధానాల కోసం కోటయ్య కమిటీని నియమిస్తూ సంతకం చేశారు. ఇక వడపోత మొదలైంది. టరమ్‌లోన్స్‌ను, ఉద్యానవన పంటల రుణాలను మినహాయించారు. ఆధార్ కార్డులేదని, ఓటర్ ఐడి లేదని, రేషన్ కార్డు లేదని అర్హులను తగ్గించివేశారు. కోటి ఎనిమిది లక్షల ఖాతాలకు గాను 53లక్షల ఖాతాలకు: రూ. 87వేల కోట్లకు గాను రూ. 24వేల కోట్ల రుణాలు మాత్రమే మాఫీకి అర్హమైనవనిగా తేల్చారు. రూ. 50వేలు దాటితే రూ. లక్షన్నర వరకు ఐదు విడతలుగా జమచేస్తామని జి. ఓలు ఇచ్చారు.

బాబుగారి మాటల్ని విశ్వసించకుండా రుణాలు రెన్యువల్ చేస్తుకొన్నవారికి ఫరవాలేదు కాని ఆయన మాటలను నమ్మిన రైతులకు మాత్రం శఠగోపం పడింది. ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకొంటే లక్షలోపు మొత్తానికి 0%, లక్షదాటితే 4% వడ్డీ కడితే సరిపోయేది. బాబు మొత్తం రద్దు చేస్తారని నమ్మిన రైతులకు 15% అపరాధపు వడ్డీ పడి అప్పు తడిసి మోపెడయ్యింది.

ప్రకృతి వైపరీత్యాలు, మార్కెట్ ఒడిదుడుకులకు లోనైన ఉద్యానవన పంటలను లాభసాటిగా ఉన్నాయని చెప్పి ఈ పథకం నుండి మినహాయించారు. ఆందోళన చేస్తే 10,000/-వరకు రద్దు చేస్తామన్నారు. ఇంకా జీవో విడుదల కాలేదు.

రుణమాఫీ పథకం వలన మనరాష్ట్ర రైతులపై రుణ భారం పెరిగింది.

రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ నివేదిక ప్రకారమే

2012 మార్చి 31 నాటికి రూ. 65,217 కోట్లు

2013మార్చి 31 నాటికి రూ. 78,916 కోట్లు

2014మార్చి 31 నాటికి రూ. 87,612 కోట్లు

2015 మార్చి 31 నాటికి రూ. 95,591 కోట్లు

వ్యవసాయ, అనుబంధ రుణ బకాయిలు ఉన్నాయి.

చంద్రబాబు రుణమాఫీ ప్రకటన తరువాత రైతుల రుణాలు పెరిగిపోయాయి. 2013 నుండి

2015కి వడ్డీల రూపంలో పెరిగిన రుణ భారం రూ.16675 కోట్లు కాగా, బాబు గారు మొత్తం రద్దు చేయబోతున్నది. రూ.24,000 కోట్లు మాత్రమే. అందులో ఇప్పటికి బ్యాంకులకు జమచేసింది రూ.7400 కోట్లు మాత్రమే. ఈకాలంలో రైతులు బ్యాంకులకు చెల్లించిన వడ్డీలు రూ.8,700కోట్లు. రుణ విమోచన కోసమేనని గొప్పగా చెప్పిన ఈ పథకం ఆచరణలో పెరిగిన అపరాధపు వడ్డీలు మాఫీ చేయడానికి కూడా సరిపోలేదంటే పథకం రైతుల పాలిట భారంగా మారింది.

**తరిగిపోతున్న పంట రుణాలు – పెరిగిపోతున్న వడ్డీ దోపిడి**

2013–14సం॥లో 13జిల్లాలో రైతులకు ఖరీఫ్, రబీలో రూ.37,058 కోట్లు వ్యవసాయ రుణాలు ఇచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2014– 15సం॥లో ఖరీఫ్, రబీకి వ్యవసాయ రుణాలు రూ.41,978 కోట్లు లక్ష్యంగా రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయించగా కేవలం రూ.29,658 కోట్లు మాత్రమే పంపిణీ చేశారు. సన్న, చిన్నకారు, కౌలు రైతులకు రుణ పంపిణీ జరగలేదు. 2015–16సం॥లో ఖరీఫ్‌కు రూ.30,587 కోట్లు, రబీకి రూ.20,391 కోట్లు మొత్తం రూ.50,979 కోట్లు ఘనంగా రుణ పంపిణీ లక్ష్యాలు నిర్ణయించబడిన ఆచరణలో రుణామాఫీ పెండిగ్‌తో వ్యవసాయ సీజన్ ప్రారంభమే 2మాసాలు గడిచిన బుక్ అడ్జస్ట్‌మెంట్స్ తప్ప రుణ పంపిణీ జరగడం లేదు. సన్న చిన్నకారు రైతులు, కౌలు రైతులు 24శాతం నుంచి 120శాతం వరకు అధిక వడ్డీ రేటుతో ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులు, కమిషన్ వ్యాపారస్తులు, పెర్టిలైజర్ షాపులు, మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్ద అప్పులు తెచ్చుకొని తీవ్ర వడ్డీ దోపిడికి గురౌతున్నారు. ఈ ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల దోపిడి, ఒత్తిడి, అవమానల వలన అత్యధిక రైతుల ఆత్మహత్యలు జరుగుచున్నాయి.

**రాజధాని పేరుతో భూ కబ్జా**

చంద్రబాబు మారలేదు అనడానికి రాజధాని పేరుతో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో లక్ష 50వేల ఎకరాల భూ సేకరణకు పూనుకోవడమే నిదర్శనం. గుంటూరు జిల్లాల్లో తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో 29 గ్రామాలల్లో 53వేల ఎకరాలు రాజధాని పేరుతో భూ సేకరణ చేస్తున్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సూమారు లక్ష ఎకరాల అటవీ భూములను డీ–నోటిఫై చేసి రాజధాని, మౌలిక సదుపాయల అభివృద్ధి పేరుతో తమ ప్రభుత్వానికి అప్పజెప్పమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వేలాది మంది పేద, మధ్యతరగతి రైతులు దశాబ్దల తరబడి మామిడి చెట్లు పెంచుకొని, చేపల చెరువులు తవ్వుకుని జీవిస్తున్నారు. 33శాతం ఉండవలసిన అటవీ భూమి రాష్ట్రంలో 21శాతం మాత్రమే ఉండటం గమనార్హం. “మాటల్లో హరిత వనం ఆచరణలో చెట్లు నరకడం” చంద్రబాబు విధానంగా ఉంది.

రాష్ట్ర విభజన సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు రాజధాని నిర్మాణం కోసం 4లక్షల కోట్ల రూపాయిలు కావాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బిజెపి, టిడిపీలు కేంద్రంలోను, రాష్ట్రంలోను అధికారంలోకి వచ్చారు. కేంద్రం రాజధాని నిర్మాణం కోసం రూపాయి విదల్చలేదు. ప్రత్యేక హోదా లేదన్నారు. కాని కృష్ణా నది ఒడ్డున సారవంతమైన జరీబు భూములలో ఆకాశ హర్మ్యాలు, రోడ్లు తదితర హంగులతో సింగపూర్‌ని తెచ్చి పెట్టడానికి ప్రణాళికలు, పథకాలు సిద్ధం చేసి భూమి పూజ కూడా చేశారు. ఎవరి డబ్బుతో ఈ రాజధాని నగరం నిర్మాణం కాబోతున్నది? కేంద్ర ప్రభుత్వం నుండి పైసా లేదు. సింగపూర్ కంపెని నుండి డాలరు రాదు. కానీ అమరావతి నగర నిర్మాణానికి బహుళ జాతి రియలెస్టేట్ కంపెనీలవారు ఎగబడుతున్నారు. సారవంతమైన భూములలో రైతులను భయపెట్టి భూములను సమీకరించి కార్పొరేట్లకు కట్టబెట్టి అందుకు వారి నుండి కానుకలు అందుకొనేందుకు (క్విడ్ ప్రోకో) దేశ దేశాలు తిరుగుతున్నారు. రాజధాని నిర్మాణానికి 3వేల ఎకరాలు సరిపోయేదానికి లక్ష 53 వేల ఎకరాలు ఎందుకు? రైతుల భూములు 32వేల ఎకరాలు సేకరించడం ద్వారా సుభిక్షమైన వ్యవసాయ భూములను నాశనం చేయడం కార్పొరేట్‌కు కట్టబెట్టడానికే. భూ సమీకరణకు అంగీకరించని రైతులను 2015 భూ సేకరణ ఆర్డినెన్స్‌ను (మోడీ ప్రభుత్వమే వెనక్కు తగ్గుతున్నా) ప్రయోగిస్తానని భయపెట్టడం చంద్రబాబుకి తగునా?

విజయనగరం జిల్లా, భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం కోసం ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 15వేల ఎకరాలు సేకరించాలనుకుంటే స్థానిక రైతులు ప్రతిఘటించారు. ఇప్పుడు 5వేలు చాలులే అంటున్నారు. మరి 15వేలు ఎకరాలు సేకరించాలని ముందుగా ఎందుకు నిర్ణయించారు? విమానాశ్రయానికి రూపాయి ఖర్చుపెట్టకుండా రైతుల భూములను ఒక కంపెనీకి అప్పజెప్పి వారి చేత విమానాశ్రాయాన్ని నిర్మింపజేసి మిగిలిన భూమిని ఆ కంపెనీ వారే అమ్ముకోటానికి అవకాశం కల్పించాలనే కుట్రే దాని వెనుక ఉంది. గతంలో వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సెజ్‌లు, కారిడార్‌ల పేరుతో లక్ష ఎకరాలకుపైగా సేకరించారు. అందులో 25శాతం భూమి కూడా నేటికీ వినియోగించలేదు. కానీ ఆ భూములు పొందిన పెద్దలు ఆ భూములను ఉపయోగించి కోట్లాది రూపాయిల బ్యాంకుల ద్వారా రుణాలు, సౌకర్యాలు పొందారు. అతి తక్కువ నష్టపరిహారం పొందిన రైతులు వ్యవసాయానికి దూరమై, పనిలేక, పడావుగా పడివున్న భూములను చూస్తూ బోరుమంటున్నారు. కాకినాడ సెజ్ భూముల్ని తిరిగి రైతులకు అపగిస్తామని ప్రతిపక్ష నాయకుడిగా అక్కడికి వెళ్ళి చెప్పిన చంద్రబాబు ముఖ్యమంత్రి అయి ఏడాది దాటినా ఆ పనిచేయకుపోవడం ఎంత మోసకారి తనం?

ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం అంతకన్న వేగంగా భూ దాహంతో పరిగెడుతున్నది. 15లక్షల ఎకరాలతో ల్యాండ్ బ్యాంకు ఏర్పాటు చేస్తానని అవసరాలు ఎంటో చెప్పకుండానే భూములను సేకరించే ప్రక్రియ మొదలెట్టింది. దశాబ్దాల తరబడి కమ్యూనిస్టు ఉద్యమం అనేక త్యాగాలతో పోరాడి సాధించిన భూ సంస్కరణల, ఎసైన్డ్, అటవీ హక్కుల చట్టల ద్వారా పేదలకు లక్షలాది ఎకరాలు పంచబడినాయి. ఆభూములను సాగు చేసుకొని జీవిస్తున్న రైతుల నుండి గుంజుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గం. దీన్ని సాగనీయరాదు. పైగా ఇక కొత్తగా పేద రైతులకు, కూలీలకు భూమి పంపిణీ లేదని మారని మనిషిగా తిరుపతిలో బహిరంగ ప్రకటన చేయడం చంద్రబాబు సహజ నైజాన్ని వెల్లడిస్తున్నది.

**విదేశీ యానాలు :**

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి బహుళ జాతి కంపెనీల, బడా వ్యాపారస్తుల ప్రతినిధులను తమ వెంట పెట్టుకుని వందల కోట్లతో ప్రభుత్వ ఖర్చులతో నెలల తరబడి పర్యటనలు సాగిస్తున్నారు. వ్యవసాయ రంగం అత్యంత ప్రాధాన్యమని చెప్పుకునే నేతలకు ఒక పర్యటనలోనైనా మన దేశ వ్యవసాయనికి మేలు జరిగే ఒక చర్చగాని, ప్రతిపాదనగాని, ప్రతినిధులను పిలిపించడం జరగలేదు. పైగా రైతుల భూములను కట్టబెడతామన్ని విదేశీ కార్పొరేట్లకు ఎర్ర తివాసీలు పరుస్తున్నారు.

**ఇరిగేషన్ :** మన రాష్ట్రం వ్యవసాయ అభివృద్ధిలో దేశ సగటు కన్న తక్కువగా ఉంది. రాష్ట్రంలో నూటికి 60శాతంమందికి పని కల్పిస్తున వ్యవసాయరంగాన్ని ప్రోత్సహించి నిలబెట్టడానికి యిరిగేషన్ అత్యంత ప్రాధాన్యమైనది. యిరిగేషన్ ప్రాజెక్టులను గత ప్రభుత్వం వేసిన శంకుస్థాపన రాళ్ళు, మొండి కాలువలు వెక్కిరిస్తుంటే జల ప్రవాహం కాక ధన ప్రవాహం పారిందన విమర్శలు వచ్చాయి. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం కూడా జల సాధన కోసం కాక నాయకుల ధన సాధన మార్గంగా ఎంచుకున్నారు. వేల కోట్లు ఖర్చుపెడుతున్నా వెనుక బడిన ప్రాంతాలకు ప్రాధాన్యత ఇచ్చి మేజర్, మీడియం ప్రాజెక్టులను పూర్తి చేసెందుకు పూనుకోవడం లేదు. 45టి.మ్.సీ.ల సామర్థ్యం గల పులిచింతల ప్రాజెక్టు రూ.1500కోట్లతో పూర్తియినా చంద్రబాబు ప్రభుత్వం 14నెలల్లుగా చంద్రబాబు ప్రభుత్వం నీటిని నిల్వచేసే ప్రయత్నం చేయడం లేదు. నిర్వాసితులకు పునారావసం కల్పించేందుకు, భూములకు నష్టపరిహారం చెల్లించేందుకు రూ. 250కోట్లు అవసరం కాగా బడ్జెట్లో రూ.120కోట్లు మాత్రమే కేటాయించారు. దాని గురించి నోరు మెదపడంలేదు ఎందుకో? పైగా హడావుడిగా రూ.1550కోట్ల ఖర్చుతో గోదావరిపై పట్టిసీమ ప్రాజెక్టును 2015 మేలో పని ప్రారంభించి ఆగష్టు 15కే మొదటి దశ నీరు ప్రకాశం బ్యారేజికి వదులుతామని గొప్పలు చెబుతున్నారు.

చిన్న నీటి వనరుల పెంపుదల పై శ్రద్ధ లేదు. నీరు – చెట్టు పథకాన్ని, ఇసుక రీచ్‌ల పంపిణీ తెలుగుదేశం మండల, గ్రామ నాయకుల కార్యకర్తల అవినీతికి ఆలవాలంగా మారింది. ప్రాధన్యత గల వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు. ప్రజల ఆహార భద్రతకు ముప్పేర్పడుతుంది.

**కరువు :** ప్రస్తుతం మన రాష్ట్రంలో 330కిపైగా మండాలల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. అనేక ప్రాంతాల్లో వేసిన పంటలు ఎండిపోతుండగా చాలా చోట్ల నారుమళ్ళు సైతం ఎండిపోతున్నాయి. కొన్ని జిల్లాల్లో పశుగ్రాసానికి కొరత ఏర్పడడంతో పశువులను కబేళాలకు తోలవలసిన దుస్థితి కల్గుతోంది. సాగునీరు లేక ప్రత్యామ్నాయం లేక రైతులు ఆందోళనలో మునిగిపోతుంటే ప్రభుత్వం కార్యచరణ ఏమిటో ప్రకటించలేదు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను, ఇతర ఇన్‌పుట్స్‌ను సన్న, చిన్నకారు రైతులకు ఉచితంగాను, మిగతావారికి సబ్సిడీపై ఇవ్వాలి. మొన్నటి దాకా గోదావరి పుష్కారాల్లో మునిగి ఇప్పుడు టర్కీ విహారయాత్రకు బాబు వెల్లడం చూస్తుంటే "యుద్ధం జరుగుతున్నప్పుడు నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్లు"గా ఉంది. తరువాత కృష్ణా పుష్కారాల్లో ప్రజల్ని ముంచడానికి సన్నహాలు ప్రారంభించారు. సమస్యలపై ఆలోచించడం మాని ఆధ్యాత్మికత మత్తులో ప్రజల్ని ముంచే విధంగా ప్రభుత్వ ఎత్తుగడ ఉంది. సంవత్సరం పైగా మత తత్వ బి.జె.పి, ఆర్.ఎస్.ఎస్‌తో కలసి పనిచేస్తున్న సహవాస దోషం వల్ల చంద్రబాబు హిందూ మత ప్రచారకుడిగా మారినట్లు ఉన్నారు.

**పెరుగుతున్న కౌలు సేద్యం – నలుగుతున్న కౌలు రైతులు**

ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 50శాతం భూమిని కౌలు రైతులు సాగుచేసి పంటలు పండిస్తున్నారు. 20 లక్షల మంది కౌలు రైతులు రాష్ట్రంలో ఉన్నారు. వీరిలో అత్యధికులు దళితులు, వెనుకబడిన తరగతులకు చెందిన వారు ఉన్నారు. వ్యవసాయ కార్మికులు, చాలినంత భూమి లేని సన్న, చిన్నకారు రైతులు కౌలు రైతులుగా ఉన్నారు. మరో ఉపాది లేక, వలసలు పోలేక వారు కౌలు రైతులుగా సంక్షోభిత వ్యవసాయ భారాన్ని తమ భుజాలపై వేసుకున్నారు. ఇలాంటి కౌలు రైతులకు ప్రభుత్వం వ్యవసాయం పేరుతో అందిస్తున్న సహాయ సహకారాలు అందాలి. అందుకు భిన్నంగా వ్యవసాయం చేయకుండా తమ భూములను కౌలుకి ఇచ్చి పట్టణాలల్లో, కడకు విదేశాలల్లో ఉంటున్న భూ యజమానులకే పట్టా హక్కులు ఉన్నాయి అనే పేరుతో ఇన్‌పుట్స్ సబ్సిడీలు, వడ్డీలేని పంట రుణాలు, పంట నష్టపరిహారాలు, పంటల బీమా పరిహారాలు ప్రభుత్వాలు, బ్యాంకులు చెల్లిస్తున్నాయి. కౌలు రైతు కుటుంబ సభ్యులు రాత్రింబ వళ్ళు శ్రమ చేస్తారు. నిత్యం పెరిగే ఎరువుల ధరలు పరిశీలిస్తే యూరియా బస్తా రూ.250–

350కి, డిఏపి రూ. 1150–1250కి, పొటాష్ రూ. 450–900 పెరిగాయి. వీటితోపాటు పురుగు మందుల ధరలు, ట్రాక్టరు చార్జీల భారం పెరుగుతుంది. బ్యాంకులు అప్పులు ఇవ్వకపోవడంతో కౌలు రైతులు వడ్డీ వ్యాపారస్తులు, పెర్టిలైజర్ షాపులు, షావుకారులు, కమీషన్ వ్యాపారస్తులు, మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్ద 24శాతం నుంచి 120శాతం వరకు అధిక వడ్డీలకు తెచ్చుకొన్ని తీవ్ర వడ్డీ దోపిడికి గురవుతున్నారు. కౌలు కూడా నగదు రూపంలో 10వేల నుంచి 50వేల వరకు, వరిలో 15నుంచి 25 బస్తాల వరకు చెరుకులో 10టన్నుల నుంచి 25 టన్నుల వరకు విపరీతమైన కౌలు దోపిడి జరుగుతున్నది. ఫలితంగా ప్రకృతి వైపరీత్యాలకు కౌలు రైతులు కోలుకోలేని రుణ భారానికి గురై ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల వత్తిడితో ఆత్మహత్యలకు గురవుతున్నారు.

అమలు కాని కౌలు రైతుల చట్టాలు – కమీషన్‌ల సిఫారసులు : జాతీయ ఉద్యమ కాలంలో అంతర భాగంగాను, కమ్యూనిస్టు ఉద్యమం 4వేల మంది బలిదానంతో 1940–50 దశకాలల్లో సాగించిన వీర తెలంగాణా రైతాంగ సాయుధ గెరిల్లా పోరాటం, సీమాంధ్రలో జరిగిన జమీందారి వ్యతిరేక పోరాటాల ఫలితంగా 1948లో జమీందారి రద్దు చట్టం వచ్చింది. దీని ద్వారా లక్షలాది మంది కౌలు రైతులకు భూములు దక్కాయి. 1950లో తెలంగాణా కౌలు రైతుల రక్షణ చట్టం వచ్చింది. 1956లో ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ప్రాంత) కౌల్దారి చట్టం వచ్చింది. ఆంధ్ర ప్రాంత కౌలుదారి చట్టం ప్రకారం కౌలు రైతులు భూ యజమానికి మధ్య వ్రాతపూర్వకమైన ఒప్పదం 6సం॥ల కాలపరిమితితో ఉండాలి. కౌలు పండిన పంటలో మెట్టలో 25శాతం, మాగాణిలో 30శాతం మాత్రమే ఉండాలి. ఏ కారణం లేకుండా కౌలు రైతులను తొలిగించరాదు. అమ్మకాలు, కుటుంబ వాటాలు వలన భూమి యజమాని మారినా కౌలు రైతులు మారరు. కౌలు రైతులు సరిపోతే వంశ పారంపర్యంగా వారసులకు కౌలు హక్కులు వస్తాయి. ప్రభుత్వం సన్న, చిన్నకారు పేరుతో ఇచ్చే సబ్సిడీలు, బ్యాంకు రుణాలు, పంట నష్ట – భీమా పరిహారాలు వీరికే ఇవ్వాలి. ఇలాంటి అభ్యుదయకరమైన చట్టానికి రాష్ట్రపతి అమోద ముద్ర పడటానికే 18సం॥లు పట్టి 1974లో చట్టరూపం దాల్చింది. ఈ కాలంలో రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ తెలుగుదేశం పార్టీల ప్రభుత్వాలు దీని అమలు చేయకుండా కౌలు రైతులకు తీవ్ర అన్యాయం చేశాయి.

ప్రొ॥ జయతీఘోష్ రైతుల సంక్షేమ కమీషన్ – 2004 : రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభ నివారణకు సూచనలు చేసేందుకు ప్రొ॥జయతీ ఘోష్ ఛైర్ పర్సన్‌గా 13 మందితో కమీషన్‌ను ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కౌలు రైతులకు పాస్ పుస్తకాలు ఇవ్వాలని, పంట రుణాలు, ప్రభుత్వ సబ్సిడీలు, ప్రకృతి నష్టపరిహారాలు, పంటల బీమా చెల్లించాలని 2004 డిసెంబరులో ఈ కమీషన్ సిఫార్సులు చేసింది. ఈ సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం

అంగీకరిస్తున్నట్లు ప్రకటించింది. గాని ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు.

కొనేరు రంగారావు భూ కమిటీ - 2006 : సంవత్సరం పాటు రాష్ట్రంలో పర్యటించి వివరాలు సేకరించి కోనేరు రంగారావు కమిషన్ కొన్ని సిపార్సులను చేసింది. వీటిని రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తూ జీ.ఒ. నెం: 1049 తేది. 28-07-2007న జారీ చేసింది. కమిటీ ఈ క్రింది సిఫార్సులు చేసింది. ఋణ అర్హత కార్డులు, పంట ఋణాలు కౌలు రైతులకు ఇవ్వాలని కౌలుదార్ల పేర్ల రికార్డులలో నమోదు చేయాలి. రెవిన్యూ, గ్రామ పంచాయితీ వారు కౌలుదార్లను గుర్తించి కార్డులు ఇవ్వాలని సిఫార్సులు చేసింది. అయితే ఇవేవీ అమలు కాలేదు.

కౌలు రైతుల పోరాటాలు : కౌలు రైతుల రక్షణ కోసం అనేక సంవత్సరములుగా సి.పి.యం. ప్రజా సంఘాల అధ్వర్యంలో అనేక ఆందోళనలు జరిగాయి. తుఫాన్‌లకు అధిక వర్షాలకు పంటలు కోల్పోతే కౌలు రైతులను సమీకరించి కౌలు తగ్గింపును అనేక చోట్ల సాధించటం జరిగింది. పశ్చిమ బెంగాల్‌లో లాగా చట్టం తేవాలని తహశిల్దార్, కలెక్టరు ఆఫీసుల వద్ద ధర్నాలు, ముట్టడి కార్యక్రమాలు జరిగాయి. అనేక సార్లు అసెంబ్లీ వద్దకు కౌలు రైతులను సమీకరించటం జరిగింది. ఫలితంగా రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం జె.ఎల్.జి. ఆర్డినెన్స్, కిరణ కుమార్ రెడ్డి ప్రభుత్వం 2011 చట్టం తేవటం జరిగింది.

2008జె.ఎల్.జి. ఆర్డినెన్స్ - 2011భూ ఆధీకృత సాగుదార్ల చట్టం : కౌలు రైతుల పోరాట ఫలితంగా ఈ చట్టాలు వచ్చాయి. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం 2008లో జాయింట్ లైబిలిటి గ్రూపుల ద్వారా కౌలు రైతులకు హక్కులు కల్పిస్తూ ఆర్డినెన్స్ తెచ్చింది. రెవిన్యూ, వ్యవసాయశాఖ వారు కౌలు రైతులను భూ యజమానుల ప్రమేయం లేకుండా గ్రామ సభల ద్వారా గుర్తించి 5 నుండి 10 మంది వరకు కౌలు రైతులను గ్రూపులుగా చేసి పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు ఇతర సౌకార్యాలు కౌలు రైతుల సొంత పూచికతుపై ఇవ్వాలని ప్రభుత్వం ప్రకటించింది. 2008 సం॥ ఆగష్టులో రిజర్వ్ బ్యాంక్ వారు జె.ఎల్.జి గ్రూపు కౌలు రైతుకు ఒక్కొక్కరికి రూ.50వేల వరకు వడ్డీ లేకుండా పంట రుణాలు ఇవ్వాలని గైడ్‌లైన్స్ యిచ్చింది. అయినా అమలు కాలేదు. కౌలు రైతులు పోరాడిన చోట్ల మాత్రమే కౌలు రైతులకు రుణాలు దక్కినవి. 2011సం॥లో కౌలురైతుల ఛలో అసెంబ్లీ, హైదరాబాద్‌లో నిరవదిక నిరాహార దీక్షల సందర్భంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం దిగివచ్చి "2011 భూ అధీకృత సాగుదార్ల చట్టం" తెచ్చింది. ఈ సందర్భముగా రిజర్వ్ బ్యాంక్ ప్రతి కౌలు రైతుకు లక్ష రూపాయల వరకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని బ్యాంకులకు ఆదేశించింది. ఈ చట్టం ప్రకారం రెవిన్యూ వారు కౌలు రైతును గుర్తించి రుణ అర్హత కార్డు ఇవ్వాలి. కౌలు రైతుకు అన్ని హక్కులు కల్పించింది. 2011 జూన్ 21న సాగుదార్ల అభయ హస్తం పేరు రాజమండ్రిలో కిరణ్‌కుమార్‌రెడ్డి పెద్ద సభ జరిపి

రాష్ట్రంలో 26 లక్షల మంది కౌలు రైతులకు కార్డులు ఇచ్చి ఋణాలు ఇతర సౌకర్యాలు కల్పిస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. కానీ ఎక్కడా అమలు కాలేదు. కౌలు రైతులకు కార్డులు, ఋణాలు రాకుండా రెవిన్యూ బ్యాంకుల వారు, భూయజమానుల అడ్డంకులు సృష్టిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వం కేటాయించే పంట ఋణాలు, ఇతర రాయితీలు, పంటలు సాగుచేయని భూయజమానులు, ఇతరులు కాజేస్తున్నారు. యేటా 26లక్షల మందికి కార్డులు యిచ్చి ఋణాలు ఇస్తామన్న ప్రభుత్వం 2011-12లో 5.23 లక్షల మందికి కార్డులు ఇచ్చి అందులో 1.93 లక్షల మందికి రూ.319కోట్ల 2012-13లో 4.24 లక్షల మందికి కార్డులు ఇచ్చి 1.31 లక్షల మందికి 312 కోట్లు, 2013-14లో 4.23 లక్షల మందికి కార్డులు ఇచ్చి 1.46 లక్షల మందికి 315 కోట్లు ఇచ్చారు. 2014-15లో 39వేల మందికి కార్డులు ఇచ్చి రూ.62కోట్లు మాత్రమే ఋణాలు అందించారు. కౌలు రైతులు పోరాడిన చోట్ల మాత్రమే రుణాలు వచ్చాయి.

పశ్చిమ బెంగాల్ అనుభవం: సి.పి.యం. నాయకత్వంలో వామ పక్ష ప్రభుత్వం అధికారానికి రావటానికి ముందు కౌలు రైతులపై విపరీతమైన దోపిడి జరిగేది. పండిన పంటలో సగానికి పైగా పంటను కౌలు కింద కట్టాల్సి వచ్చేది. అంతే గాక భూస్వాములు, వారి రౌడి మూకలు గ్రామాలలో అరాచకాలు, దౌర్జన్యాలు జరిపేవారు. కౌలు రైతును భూముల నుండి బేదఖలు చేసేవారు. ఒక్కోసారి పూర్తి పంటను భూస్వాములు కాజేసేవారు. ఆనాటి ప్రభుత్వాలు భూస్వాములు కొమ్ముకాసాయి. ఈ సయమంలో సి.పి.యం అధ్వర్యంలో "తెభాగా" పేరుతో కౌలు రైతులకు మూడు భాగాలు, భూ యజమానికి ఒక భాగమే వుండాలని పెద్ద ఎత్తున పోరాటం చేసారు. 1977లో పశ్చిమ బెంగాల్ అధికారానికి వచ్చిన సి.పి.యం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం "ఆపరేషన్ బర్గా" పేరుతో కౌలు రైతులకు హక్కులు కల్పించారు. గ్రామ సభలు జరిపి 16 లక్షల మంది కౌలుదార్లను ప్రభుత్వమే గుర్తించింది. ప్రభుత్వం అందించే అన్ని పథకాలను కౌలు రైతులకు వర్తింపజేసారు. పండిన పంటలో నాలుగవ వంతును కౌలు నిర్ణయించారు. పంట ఋణాలు, సబ్సిడీలు కౌలు రైతుకు అందించారు. నీటి సౌకర్యం కల్పించారు. మార్కెట్‌లో ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వమే పంటలను కొనుగోలు చేసింది. ఈ చర్యలతో పశ్చిమ బెంగాల్ దేశంలో అత్యధిక ఆహారా ధాన్యాల ఉత్పత్తి రాష్ట్రంగా ఎదిగింది.

తెలుగుదేశం ఎన్నికల ముందు ఏమి చెప్పింది : తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రణాళికలోను, బాబు పాదయాత్ర సందర్భంలోనూ మమ్ములను గెలిపిస్తే రాష్ట్రంలోని కౌలు రైతులందరికి ఋణ అర్హత కార్డులు ఇచ్చి ప్రతి కౌలురైతుకు లక్ష రూపాయల వరకు వడ్డీలేని ఋణం ఇస్తామని, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని వ్యవసాయ ఋణాలన్ని రద్దు చేసి రైతులను ఋణ

విముక్తి చేస్తామని డా॥ స్వామినాథన్ సిఫార్సులు అమలు జరిపి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి వ్యవసాయాన్ని లాభ సాటిగా చేస్తామని వాగ్దానం చేసింది.

అధికారానికి వచ్చిన తర్వాత ఏమి చేసింది : బాబు అధికారానికి వచ్చిన తర్వాత వాగ్దానాలన్నింటిని విస్మరించింది. ఇప్పటి వరకు కౌలు రైతుల ఋణమాఫీ జరగలేదు. వడ్డీ భారం పెరిగింది. పైగా గత 2 సంవత్సరాలుగా కౌలురైతులకు ఋనాలు ఇవ్వలేదు. దీంతో కౌలు రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలు పండించాల్సిన దుస్థితి ఏర్పడింది. 2014-15లో రాష్ట్రంలో 1.40 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టి 49775 కోట్ల పంట ఋణాలు విడుదల చేసింది. మూడు వంతులకు పైగా ఆహార ధాన్యాలను పండించింది కౌలు రైతులే. ఋణాలు దక్కింది కౌలురైతులకు కేవలం 62కోట్లు మాత్రమే. బాబు సొంత జిల్లా చిత్తూరులో సహ 5 జిల్లాలోని కౌలు రైతులలో ఒక్కరికి ఋణం రాలేదు. ఋణ మాఫీలో అర్హత వ్ను 2.5 లక్షల మంది కౌలు రైతుల ఋణాలు 574కోట్లు ఇంత వరకు రద్దు కాలేదు. పంటలకు గిట్టుబాటు ధరలు కాదుకదా కనీస మద్దతు ధరలు కూడా ఈ కాలంలో రాలేదు. ధాన్యం 75 కిలోల బస్తా రూ.1050/-లకు కొనాల్సిండగా 900రూ॥లకు మించలేదు. పత్తి క్వింటా 4050రూ॥లకు గాను రైతులు 2500 నుండి 3500 వరకు మాత్రమే అమ్ముకొవాల్సి వచ్చింది. మిగతా పంటల ధరలు కూడా తగ్గాయి.

పోరాడి హక్కులు సాధించుకొవాలి : ఈ పరిస్థితులలో రైతులు మరియు కౌలు రైతులంతా సంఘటితమై ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాడాలని సి.పి.యం. పిలుపునిస్తున్నది. అప్పుడు మాత్రమే రుణ మాఫీ, రుణాలు ఇతర సౌకర్యాలు వస్తాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభం అయినందున తక్షణమే రుణాలన్నీ మాఫీచేసి, కార్డులు, రుణాలు దక్కే వరకు ప్రణాళికా బద్దంగా పోరాడాలి. దీనికోసం కలిసి ఉద్యమించాలి.

**డిమాండ్స్ :**

**1.కార్పొరేట్లకు 15లక్షల ఎకరాలను కట్టబెట్టే ల్యాండ్ బ్యాంకు విధానాన్ని రద్దు చేయాలి. పెట్టుబడిదారులకు అవసరమైన భూములను రైతులతో చర్చించి వారే కొనుగోలు చేసుకోవాలి. ప్రభుత్వం ఈ విషయంలో వ్యవహరిస్తున దళారి పాత్ర నుంచి వైదొలగాలి.**

**2.కరువు ముంచుకొస్తున్నది కనక ప్రత్యామ్నాయ పంటలు ప్రణాళికను వెంటనే అమలు చేయాలి. విత్తనాలు, ఎరువులు ప్రభుత్వమే అందించాలి.**

**3.రూ. 50వేల లోపు రుణాలను ఒకే దఫా మాఫీ చేసి రైతుల ఖాతాలకు వెంటనే జమచేయాలి. 01-04-14 నుండి రైతులపై పడిన వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరించాలి. ఆర్.ఎమ్.జీ., జెల్.జీ.లకిచ్చిన రూ. 574 కోట్ల రుణాలన్నింటిని రద్దు చేయాలి. 2008 కేంద్ర ప్రభుత్వ రుణమాఫీ పథకంలో మాఫీ వర్తించక, 2007 జనవరి నుండి మార్చి వరకు సహకార బ్యాంకుల్లో రైతులు తీసుకున్న**

రుణాలను మాఫీచేయాలి. ఉద్యానవన పంటల రుణాలు మాఫీ చేయాలి. ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఉంటేనే రుణమాఫీ అనే షరతులు తొలగించి రూ.లక్షన్నరలోపు రుణాలన్ని మాఫీ చేయాలి. 2015 ఖరీఫ్‌కి పంట రుణాలు ఇవ్వాలి.

4.కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారస్సులు ప్రకారం చేయబడిన జీవోల మేరకు ప్రభుత్వ అధీనంలో ఉన్న లక్షలాది ఎకరాల బంజరు భూములను వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు, కౌలు రైతులకు పంచాలి.

5.సన్న, చిన్నకారు రైతులకు, కౌలు రైతులకు పూర్తి సబ్సిడీపై ఇన్‌పుట్స్ సరఫరా చేయాలి.

6.కౌలు రైతులందరికి వారి సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలి. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం వడ్డీలేని రుణాలు, పంట నష్టం - బీమా పరిహారాలు చెల్లించాలి.

7.స్వామినాధన్ కమిషన్ సిఫారస్సులు ప్రకారం ఉత్పత్తి ఖర్చుల అదనంగా 50శాతం కలిపి మద్దతు ధరలను నిర్ణయించాలి.

8.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఏజెన్సీల ద్వారా మార్కెట్ ఇంటర్ వెన్షన్ స్కీమ్ ద్వారా మద్దతు ధరలకు రైతుల పంటలను పంటకల్లాల్లోనే కొనాలి.

9.సర్వే నెంబర్ ప్రాతిపదికపై పంటల బీమా పధకాన్ని అమలు చేయాలి. బీమా ప్రీమియాన్ని సన్న - చిన్నకారు రైతులకు, కౌలు రైతులకు ప్రభుత్వమే చెల్లించాలి. మిగతా రైతులకు సగ భాగం ప్రభుత్వం చెల్లించాలి.

10.రైతులు సాగుచేసుకుంటున్న బంజరు భూములకు పట్టాలు ఇవ్వాలి. పంట రుణాలు ఇవ్వాలి.

11.వ్యవసాయ అనుబంధ డైరి, పౌల్ట్రీ, చేపలు-రొయ్యలు, గొర్రెలు-మేకలు, పందులు పెంపకానికి 50శాతం సబ్సిడీపై పేద రైతులకు కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి.

12.తక్కువ ఖర్చుతో పూర్తి అయ్యే చెరువులు, బోరుబావులు, లిఫ్ట్ యిరిగేషన్‌లు లాంటి చిన్న నీటి తరహా ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి త్రాగునీరు, సాగునీరు సౌకర్యాలను పెంచాలి.

13.వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాల్లో నీటి పారుదల ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించి పూర్తి చేయాలి. అవినీతిని అరికట్టాలి.

14.కరువు, వరదలు వలన నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల నష్టపరిహారం ఇవ్వాలి. త్రాగునీరు, పశువులకు గ్రాసం ఉచితంగా ఇవ్వాలి.కరువు నిబంధనలను అమలు చేయాలి. ఉపాధి పనులు కల్పించాలి. బంగారంవేలాలను అపాలి. రుణమాఫీ తరువాత వడ్డీలను మాఫీ చేయాలి.

పై కోర్కెలు సాధనకు రైతులు, కౌలు రైతులు ఆగష్టు 14న తహశీల్దార్ కార్యాలయాల ముందు జరిగే ధర్నాలకు మెమొరాండాలతో తరలి రావలిందిగా కోరుచున్నాము.

వెల రూ. 2/-

సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, 27-13-3, ఆకుల వారి వీధి, గవర్నర్‌పేట విజయవాడ - 2
ఫోన్ నెం. 0866 - 2577202, ప్రచురణకర్త: పి.మధు, రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ(ఎం) పార్టీ, ఆంధ్రప్రదేశ్